**జబ్బును బాగుచేసుకోడం కోసం డాక్టర్ ప్రిస్క్రిప్షనా? ప్రిస్క్రిప్షన్ కోసం జబ్బు తెచ్చుకోడమా?**

కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ లయబద్ధంగా చప్పుడు చేస్తూ చిన్న చిన్న స్టేషన్లు దాటుతోంది. ఎదర సీట్లోని అమ్మాయి మత్తుగా, చేతులు వెనక్కి పెట్టి, బద్ధకంగా వళ్లు విరుచుకుంది. ఖజురహో బొమ్మని జ్ఞప్తికి తెస్తూ.

అదే యింకో సమయంలో అయితే చాలా ఎంజాయ్ చేసేవాడిని. కాని రైల్లోంచి ఎంత త్వరగా బయటపడదామా అని వున్న నాకు విసుగనిపించింది. ఎప్పుడు బెజవాడ వస్తుందా, ఎప్పుడు సుధాకర్‌ని కలుసుకుందామా అని వుంది.

వాడిని గురించిన వూహలే మెదలుతున్నాయ్. ఆరేళ్ళు కలిసి చదువుకున్నాం. ఒకే రూంలో కాపురం ఎంతో మంది అసూయపడేవాళ్ళు. చదువులయి విడిపోయాక ఆరేళ్ళ క్రితం అనుకోకుండా కలుసుకున్నాం వాడు బిజినెస్ టూర్ మీద కలకత్తా వచ్చినపుడు. అప్పటికే నేను ఒక లీడింగ్ ఫర్మ్‌లో బిజినెస్ ఎగ్జిక్యూటివ్‌గా వుంటూ నాల్గు అంకెలమీద గడిస్తున్నా- వాడు పెద్ద బిజినెస్ పెట్టి నాల్గుచేతులా సంపాదిస్తున్నాడు. చచ్చిపోయిన నాన్నకు జబ్బుగా వుందని వారం సెలవు పెట్టి వాడితోనే గడిపా ఆ వారం నిముషాల్లా గడిచిపోయింది తనకే యిప్పటికీ గుర్తు వాడు స్కాచ్ కోసం నేపాలీ పిల్లకోసం ఎంత ఖర్చు పెట్టేడని! వాడికి సెండాఫ్ యివ్వడానికి స్టేషన్‌కి వచ్చినపుడు నా దగ్గర ప్రామిస్ పుచ్చుకున్నాడు: అధమం ఒక వారమైనా వాడితో గడుపుతానని తర్వాత వాడి పెళ్ళి జరిగినా, నా ఫారిన్ టూరు మూలంగా వాడిని కల్సుకోలేకపోయా. మళ్ళీ యిప్పుడే కలుసుకోబోవడం.

వాడు ఎలా వున్నాడో? ఏమో? అలవాట్లు మార్చుకున్నాడా? అలాగే వున్నాడా? వాడే నాకెళ్ళ ముందు మెదులుతున్నాడు

ఒక్క కుదుపుతో రైలు ఆగింది — ఆలోచనల నుంచి తేరుకున్నా.

"దయ చేసి వినండి. యిప్పుడు అయిదవ నెంబరు ప్లాటు ఫారంపై ఆగిన రైలు- హౌరా నుంచి మద్రాసు పోయే కోరమండల్ ఎక్స్‌ప్రెస్-" బెజవాడ ప్లాటు ఫారం లౌడ్ స్పీకర్ చెప్తోంది.

నేను ఖంగారుగా రైలు దిగి ఆత్రుతగా వాడి కోసం చూశా. దూరంగా జనాన్ని తప్పించుకుంటూ వస్తున్న సుధ కనిపించాడు. ఆరేళ్ళయినా, వాడిలో ఏ మార్పు లేదు. వచ్చీరాగానే నన్ను వాటేసుకున్నాడు. నా కళ్ళు వాడిని చూడగానే చెమ్మగిల్లాయ్. వాడి ఫ్యాన్సు మా కేసి విచిత్రంగా చూస్తున్నారు సామాన్లు వాళ్ళకి అప్పగించి బయటకు వచ్చాం.




# ప్రిస్క్రిప్షన్

అమంత

దార్లో నేను వచ్చినందుకు థాంక్సు చెపుతూనే వున్నాడు. నా కోసం ఎంతో ప్రోగ్రాం ఫిక్సు చేశానని చెప్పాడు. నేను నవ్వుతూ 'వూ' కొట్టా-

కారు పోర్టికోలో ఆగింది, వాడి పిల్లలు యిద్దరూ వచ్చారు 'డాడీ డాడీ' అంటూ. "ప్రసాద్ అంకుల్" అంటూ నన్ను వాళ్ళకి పరిచయం చేశాడు పిల్లలిద్దరూ నన్ను చుట్టేశారు. రుక్మిణిని చూపిస్తూ అన్నాడు "నా బెటర్ హాఫ్ - అయిమీన్ - నా బెటర్ హెల్త్" అని.

"మీ గురించి ఈయన చెప్పని రోజు లేదు" అంది నాకు ప్రతి నమస్కారం చేస్తూ.

"మీరు వచ్చినా నన్ను మర్చిపోలేదన్న మాట" నవ్వుతూ అన్న మాటకు, ఆమె కూడా నవ్వేసింది.

నాకు ప్రత్యేకించిన గదిలో, వాడినీ వాడి సంసారాన్ని గురించి ఆలోచిస్తూ స్నానం చేశా. వాడి సంసారం చూడ ముచ్చటగా వుంది. రుక్మిణి అన్నివిధాలా వాడికి తగిన భార్య. తెలివైన పిల్లలు. కాన్వెంటు యాసతో యింగ్లీషు తెగ వాగేస్తున్నారు. నాకు చెరోవైపూ చేరి.

భోజనానికి డైనింగ్ టేబిలు దగ్గరకు వచ్చా. ఒకే ప్లేటువుంది. సుధకేసి చూశా "నీవు తినవా?" అన్నట్టుగా.

"నేనే అన్నయ్యగారూ- ఆయన్ని తినేయమన్నా. లేటయితే ఆయనకు అరగదని" బాధ్యత తనదే అన్నట్టుగా చెప్పింది. నవ్వుకున్నా. భోజనం అయిన తర్వాత నేమా. వాడూ డ్రాయింగ్ రూమ్‌లో కూర్చున్నాం. రుక్మిణి వచ్చి నా పక్కడికే వక్కపొడి యిచ్చింది. సుధకి కూడా ఆఫర్ చేశా- "ఆయన్ని అన్నిసార్లు వేసుకోవద్దన్నారు. అన్నయ్యగారూ" అంది.

ముందుకు జాపిన చెయ్యి వెనక్కి తీసుకున్నాడు సుధ. నేను సిగరెట్టు అంటించా వాడికి ఒకటి ఆఫర్ చేస్తూ. "ఆయన మానేశారండి" అంది ఆమె. సుధ నవ్వాడు- "చాల సిస్టమాటిక్‌గా తయారయ్యావ్"..... ఓ కాంప్లిమెంట్ పారేశా- సుధ పెదాలపై మళ్ళీ ఓ చిరునవ్వు

సుధా. నేనూ కబుర్లలో పడ్డాం- గడియారం పది కొట్టింది. బయట పున్నమి వెన్నెల పుచ్చపూవులా పూస్తోంది. "యీ టైములో కృష్ణా బేరేజీ ఎలా వుంటుందో? అలా పోదామా?" అన్నా "నటీజ్ గుడ్" అంటూ లేచాడు సుధ. అంతలో లోపల నుంచి రుక్మిణి వచ్చింది.

"పది అయ్యిందండీ. పెందరాళే పడుకుంటే మంచిదికదా" అంది. అందులో అభ్యర్థనలేదు. ఆజ్ఞ ధ్వనిస్తోంది. నేను మాట్లాడలేదు వాడితో. ఎంతో ఫ్రీగా రాత్రల్లా మాట్లాడుకోవాలని వుంది.

నేను వాడికేసి చూశా.

"ఆల్‌రైట్ — రేపు మాట్లాడుకుందాం. ఎలాగూ నువ్వు రెస్టు తీసుకోవాలిగా-" అంటూ లేచి నా సమాధానం చూడకుండా "గుడ్‌నైట్" అంటూ తన గదికేసి నడిచాడు.

వాడి ప్రవర్తన చూసి షాక్ తిన్నా. యిన్ని సంవత్సరాల స్నేహం- అనుబంధం- ఆత్మీయత- అంతా యింతేనా- సంవత్సరాల కొద్దీ వున్న సంగతులతో తెల్లవార్లు రాత్రులు ఎన్నో గడుపుదామని వచ్చా! కానీ!! ఏం అనలేకపోయా— నా గదిలోకి వచ్చా- నిద్ర పట్టటం లేదు. బద్ధకంగా పక్కమీద పొర్లా. పావుగంట పోయిన తర్వాత పక్కగదిలో మాటలు విన్పించాయ్.

"అబ్బ. యిప్పుడుకాదండి.. ఎల్లుండి- డాక్టరేమి చెప్పాడు?" అంటోంది రుక్మిణి వాడు నిరాశగా మూల్గాడు.

తెల్లవారింది — ప్రయాణబడలికవల్ల కాస్త ఆలస్యంగా లేచా. వార్తలనుకుంటా, రేడియో గరగరలో అస్పష్టంగా వినిపిస్తున్నాయి. సుధ పిల్లలను తీసుకొని కారుకేసి నడుస్తున్నాడు "డ్రైవర్ లేడా?" అని అడిగా, కాఫీ అందించిన రుక్మిణితో.


"డ్రైవర్‌కి పిల్లలని వప్పగించితే. వాడికి రెస్పాన్సిబిలిటి ఏముంటుంది-ఆయనే వెడితే, వాళ్ళ మంచి చెడ్డలు స్వయంగా తెలుసుకోవచ్చుగా" అంది రుక్మిణి. వాడు నాకేసి చూసి ఓ నవ్వు విసిరి, కారు స్టార్టు చేశాడు. సుధా, వాడి అలవాట్లు గురించి ఆలోచించుకుంటూ. నా వుదయపు కార్యక్రమం పూర్తి చేశా. అప్పటికి సుధ తిరిగి వచ్చాడు. బ్రేక్‌ఫాస్టు టేబిలుదగ్గర కూర్చున్నాం టిఫిన్ తింటూంటే వాడేమీమాట్లాడలేదు. రుక్మిణి నాకు కాఫీ యిచ్చి వాడికి హార్లిక్సు యిచ్చింది. హార్లిక్స్ అంటే ఆమడ దూరం పరుగెత్తే సుధ హాయిగా తాగేశాడు! నేను వెక్కిరింపుగా నవ్వా. వాడు అదేమీ పట్టించుకోలేదు.

గడియారం తొమ్మిదిదాటడానికి ప్రయత్నిస్తోంది.

"మీకు టైము అవుతోంది" రుక్మిణి సుధ కేసి చూస్తూ అంది. కప్పు టేబిలుపై పెట్టి లేచాడు. నేనూ లేచాను.

"నేను వంటి గంటకు వస్తా అందాకా టేప్ రికార్డర్, రికార్డు ప్లేయరుతో కాలక్షేపం చేయ్" తన కూడా నన్ను రావద్దన్నట్టుగా నిర్మొహమాటంగా చెప్పాడు. నాకు మతిపోయింది. ఏమిటీ వీడి వుద్దేశ్యం? పనిగట్టుకొని యింతదూరం యిన్ని సంవత్సరాల తర్వాత వస్తే — వీడూ, వీడి ఆఫీసు పనీ. నన్ను కూడా ఆఫీసుకు రమ్మనవచ్చుగా — ఈ రికార్డు ప్లేయరూ, టేపు రికార్డరూ. ఈ తిండీ నాకు దొరక్క వచ్చానా? నాకు చాల కోపం వచ్చింది- యింతలో కారు స్టార్టయిన చప్పుడు వినిపించేసరికి అలా చూశా- కారు కదిలింది.

టయిమ్ గడవటం లేదు రికార్డు ప్లేయరూ, రికార్డరూ బోరుకొట్టాయి ఏం చదవ బుద్ధికావేదు. మళ్ళీ కాఫీ తాగాలనిపించింది. వంట వాడిని కేకేసి చెప్పా. అయిదు నిముషాల్లో వాడు కప్పు చేతికందించాడు - గుక్క త్రాగా. గొంతుక దిగలేదు కప్పుడు పాలల్లో రెండుచుక్కల



డికాక్షన్ చేశాడు. వాడు నా అవస్థ చూశాడు.

"అలవాటుచొప్పున అయ్యగారికి యిచ్చే ట్టుగా తెచ్చా సార్. మళ్ళీ తయారు చేసి తీసుకు వస్తా" అంటూ నా చేతిలో కప్పు తీసుకొని వెళ్ళాడు. రెండు నిముషాల్లో స్ట్రాంగ్ కాఫీ యిచ్చాడు.

"మీ అయ్యగారు మామూలుగా తాగరా?" అని అడిగా.


"రెండవ సారి కాఫీ యివ్వద్దనీ, యిస్తే యిలా లైట్‌గా యివ్వమని అమ్మగారి ఆర్డరు సార్" కప్పు తీసుకొని పోతూ చెప్పాడు నాకు ఆశ్చర్యం వేసింది. స్కాచ్ త్రాగేవాడు వాడికి స్ట్రాంగ్‌కాఫీ నిషేధమా?

సరిగ్గా ఒంటి గంటకు కారు పోర్టికోలో ఆగింది. సుధ వచ్చాడు "ఏరా.... ఒక రౌండు బీరు తీసుకుందాం ఎండగా వుందిగా" అన్నా. వాడు అదిరిపోయాడు. సమాధానం చెప్పకుండా లోపలికిపోయాడు. అందరం డైనింగ్ టేబిల్ దగ్గర కూర్చు న్నాం. రుక్మిణి స్వయంగా వడ్డిస్తోంది. నాకు ఆవకాయ, గోంగూర, గుత్తి వంకాయ వగయిరా అన్నీ వడ్డించింది— సుధ విస్తట్లో, నిమ్మకాయ, వుసిరికాయ చప్పిడి కూరలు వడ్డించింది. వాడికి వేరేగా చేసిందనుకుంటా.

"పత్యం చేస్తున్నావా?" అర్థంకాక, సంశయంగా అడిగా.

బుర్ర అడ్డంగా వూపాడు. ఏం లేదన్న ట్లుగా.

"మరి...." సంశయ నివృత్తి కోసం అడిగా. "అదేం కాదు అన్నయ్యగారూ- మనిషి ముప్పైఏదాటి నలభై పడిలో పడే టప్పుడు చాల జాగ్రత్తగావుండాలండీ.... లేకపోతే బి.పి., కొలెస్ట్రాల్ వస్తాయని డాక్టరు రావ్‌గారు చెప్పారు. ఆయన నాలుగేళ్ళు ఫారెన్‌తో వుండి వచ్చారు. అందుకనే యీ ప్రివెన్‌టివ్ మెథడ్సు." రుక్మిణి కారణాలు చెప్పింది. ఆమె మాట లకి, నా బీ. పీ. పెరగ బోయింది. ఆ ప్రిన్సిపల్సు నాకు అప్లై చేస్తుందేమోనని. కానీ, నాకు మాత్రం చిక్కటి పెరుగు వేసింది. వాడికి వెన్న తీసిన మజ్జిగ ప్లేటు నిండా పోస్తూ "అన్నయ్యగారూ- పెరుగుతో రోజూ తింటే కొవ్వు పట్టి కొలెస్ట్రాల్ ఎక్కువవుతుందట వారానికో రోజయితే ఫర్వాలేదని మా ఫారెన్ రిట ర్న్‌డ్ డాక్టర్ చెప్పారు" అంది. అన్నం తిన్న తర్వాత వాడికి రెండే రెండు వక్క పలుకులు యిచ్చి, డబ్బా నా చేతికి యిస్తూ "వక్కపొడి ఎక్కువ తింటే రక్తం విరిగి పోతుందిట. డాక్టరు చెప్పారు" అంది తర్వాత సంభాషణ అంతా ఆ నాదే. వాళ్ళ



రాయలసీమ రత్నాలు :

# కళాప్రపూర్ణ పైడి లక్ష్మయ్యగారు



రాజకీయాలలోను, సాహిత్యంలోను సవ్యసాచిగా ప్రసిద్ధిపొందిన పైడి లక్ష్మయ్యగారు ఎండోమెంటు కమిషనర్‌గా ఆంధ్ర దేశానికి సుపరిచితులు. 'టర్బన్' తలపై మెరుస్తుండగా ఆయన సభా వేదికలపై కనిపిస్తారు. నిరంతరం సాహిత్య గోష్ఠులతో కాలం గడిపే వీరికి పైడికి తావి అబ్బినట్లుగా సాహిత్యగంధం కలిగింది. శ్రీశైలందేవస్థానపునరుద్ధరణకు విశేష కృషిచేసిన వీరు శ్రీశైలం దేవాలయ పాలకవర్గ అధ్యక్షులుగా 1981లో ఎన్నుకోబడ్డారు.

1904 జూన్ 26న అనంతపురం మండలంలో జన్మించారు లక్ష్మయ్యగారు న్యాయవాద వృత్తిలో వారు కొంతకాలం జీవనం సాగించారు. నీలం సంజీవరెడ్డి గారితో సన్నిహిత సాహచర్యం కలిగింది. అనంతపురం జిల్లా బోర్డు అధ్యక్ష పదవి, పార్లమెంటు సభ్యత్వము. దేవాదాయశాఖ కమిషనరు పదవి వీరిని వరించివచ్చాయి. తొలి పార్లమెంటుకు 1952లో ఎన్నికయ్యారు. అప్పుడు రాజేన్‌బాబు రాష్ట్రపతి. ఉపరాష్ట్రపతి డాక్టరు సర్వేపల్లి రాధాకృష్ణన్. మేధావులైన వారితో వీరు గోష్ఠులు చేసేవారు. తరువాత తరువాత రాజకీయాలకు క్రమంగా దూరమై సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాల పట్ల ఆసక్తిని కనబరుస్తూ వచ్చారు. శ్రీశైలం దేవాలయ జీర్ణోద్ధరణ వీరి కృషి ఫలితమే. హేమారెడ్డి మల్లమ్మ నాటకం వీరు ప్రచురించారు. ఆ నాటక ప్రదర్శనను అప్పటి ప్రధాని పండిత నెహ్రూ ఆసక్తితో తిలకించారు. ఆ నాటక ప్రచురణవల్ల కలిగిన లాభంతో శ్రీశైలంలో "పైడిసదనం" అనే కాటేజి నిర్మించారు.

విద్యార్థి దశలోనే "మార్కండేయ" నాటకం రచించారు. నాటక రచనకు, చారిత్రక, పౌరాణికేతివృత్తాలను స్వీకరించి- మార్కండేయ విజయము, మహాత్మ కబీరు, శ్రీరామాశ్వమేధం తారా శశాంక, హేమారెడ్డి మల్లమ్మ, శ్రీ శైలీయం రచించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం వారు వీరిని కళాప్రపూర్ణ బిరుదంతో సత్కరించారు. అనంతపురం జిల్లా రచయితల సంఘాధ్యక్షులుగా వీరు చాలా కాలం వ్యవహరించారు. ఆంధ్ర దేశంలోని అనేక దేవాలయాలకు వీరు కమిషనరుగా ఉన్నకాలంలో ప్రణాళికలు సిద్ధంచేసి పేరు సంపాదించారు. వీరి కుమారులు డాక్టర్ పి. యల్. సంజీవరెడ్డిగారు ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ఆగ్రో ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్‌గా పదవీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ●

డా॥ ఆర్. అనంతపద్మనాభరావు

ఫారెన్ రిటర్న్‌డ్ డాక్టరు దేనిని గురించి ఏం చెప్పాడో క్షుణ్ణంగా నాకు చెప్పింది.

అరగంట పోయినతర్వాత సుధ నోరు విప్పాడు.

"రుక్కూ మన కొత్త డిస్ట్రిబ్యూషన్ వాళ్ళు. అర్జంటుగా మాట్లాడాలని, అధమం మూడు రోజులుండేటట్లుగా రమ్మనమని ఫోనుచేశారు. సాయంత్రానికే హైదరాబాదు రమ్మన్నారు. ఏం చేయడానికీ తోచటంలేదు" అన్నాడు.

"రాత్రి ప్రయాణం ఎందుకూ నిద్ర పాడవుతుంది. ప్రొద్దున్నే వెళ్ళండి." అంది రుక్మిణి.

"మరి వీడున్నాడుగా" నాకేసి చూపిస్తూ అన్నాడు.

రుక్మిణి సమాధానం చెప్పలేదు. వాడు నాకేసి చూశాడు.

యిక్కడ నుంచి ఎలా పోవాలా బాబూ అనుకుంటున్న నాకు భలే ఆయిడియా తట్టింది

"నాకు మెడ్రాస్‌లో అర్జంటు పని వుంది నేను వెళ్ళి ఆ పని చూసుకొని నువ్వు వచ్చేటప్పటికి వస్తా" అన్నా యిక్కడ నుంచి బయటపడాలని.

"అదే బాగుంటుంది" అంది రుక్మిణి

"అలాఅయితేనే బాగుంటుదనుకుంటా యిద్దరి పనులూ జరుగుతాయి" సుధ వంత పాడాడు.

నాకు చిర్రెత్తుకొచ్చింది నేను వెళతానంటే వద్దనో. తనతో వచ్చేయమనో. లేకపోతే తనే ఆగిపోతాననో. ఏదో విధంగా బలవంతం పెడతాడనుకుంటే. నిర్మొహమాటంగా చెప్పాడు. ఛ: యిటువంటి వాడికోసమేనా. నేను మా ఆవిడతో వున్న కాశ్మీర్ ట్రిప్ కాన్సిల్ చేసుకొని వస్తే- చాల ఫూలిష్ ఈ వెధవ యింత బిజినెస్ మైండెడ్‌గా వుంటాడంటే అసలు రాకపోదును. నిజంగా నాకు మెడ్రాస్‌లో పని లేదు. అయినా యిక్కడ నుంచి యీ నియమాలూ నిష్ఠల నుంచి బయటపడాలి. అందుకే బయలుదేరాలనుకున్నా

వాడు మధ్యాహ్నం ఆఫీసుకు పోయి ఎనిమిదింటికి యింటికి వచ్చాడు. నేను వాడి పిల్లలతో కాలక్షేపం చేశా. రాత్రి రుక్మిణిగారి ఫారెన్ రిటర్న్‌డ్ డాక్టరు సలహాలు తలచుకుంటూ "మందులేని" డైట్ మీల్స్ పూర్తిచేసి పడుకున్నా. పొద్దున లేచేసరికి రుక్మిణి ఒక సజ్జ నిండా సీసాలు పెట్టించి పాక్ చేసింది. రాత్రి వాడితో ఎన్నిసార్లు చెప్పిందో జ్ఞాపకంలేదు కానీ, పొద్దున ఆ గంటలోనూ వందసార్లయినా చెప్పివుంటుంది. ఎప్పుడు. ఏటానిక్కు. ఎలావేసుకోవాలీ. అని వాడి చెవులు ఎలావున్నాయోగానీ, నా చెవులు గింగిర్లెత్తుకుపోయాయి.

మా యిద్దరి ట్రైన్ టైములూ ఒకటేట. అందుకని యిద్దరం కలసే స్టేషన్కొచ్చాం. డ్రైవరు సామాన్లు కవుంటరు దగ్గర పెట్టాడు. వాడిని వెంటనే పొమ్మన్నాడు సుధ.

నేను బుకింగ్‌దగ్గరకువెళ్ళా. మెడ్రాస్‌కి టిక్కెట్టుతీసుకోవడానికి. సుధ నా దగ్గరకు వచ్చి నా నడుం చుట్టూ చేయివేసి, లాక్కుపోయాడు

"టిక్కెట్టు తీసుకోనీయ్" అన్నా. నా గొంతుకలోని విసుగు స్పష్టంగా నాకే విన్పించింది.

"నే తీయించా" అన్నాడు. నేను మాట్లాడలేదు. ప్లాటుఫారాలపై రెండు ట్రైన్లూ వున్నాయ్. కూలీలచేత నా సామానూ. వాడి సామానూ హైదరాబాదు రైల్లో పెట్టించాడు. నాకు అర్థం కాలేదు. "నువ్వు హైదరాబాదు వరకూ నాకు కంపెనీ యిచ్చి అక్కడ నుంచి మెడ్రాసుకి ఫ్లైట్ అవ్వచ్చు" అన్నాడు. నాకు వెర్రి కోపం వచ్చింది. ఈ బోరు యింకా భరించాలా అని.

"సర్లే- ఆరు గంటల సేపు ఒంటరిగా దొరుకుతాడు. దులిపేయచ్చు" కసిగా అనుకున్నా. మా ప్రయాణంలో సంభాషణలు

ముభావంగా జరిగాయి. నాంపల్లిలో దిగి టాక్సీలో హోటలుకు వెళ్ళాం. ముందే బుక్ చేసి వుంచాడనుకుంటా. వెతుక్కోకుండా రూమ్ దొరికింది. అప్పటికే ఒంటి గంట అయింది.

"సుధా....మీ ఆవిడ ఫిక్స్ చేసిన మీల్సు టయిము అయిందిరా" వాడికి గుర్తుచేశా. నా కంఠంలోని వేళాకోళం వాడు గమనించినా. ఏం అనలేదు, ఒక నవ్వు నవ్వాడు.

"బేరర్ని పిలు" నిముషం ఆగి అన్నాడు. బజర్ నొక్కా "రెండు స్పెషల్ మీల్సు" వచ్చిన బేరర్కి ఆర్డరు యిచ్చా. బేరర్ కదిలాడు.

"వెయిట్-" సుధ అన్నమాటకి-బేరర్ ఆగాడు. వాడు తెరచిన తలుపు గుండా వేడి గాలి కొడుతోంది. దగ్గరకు రమ్మనమని సౌంజ్ఞ చేశాడు. బేరర్ వచ్చాడు.

"ఏరా- ఎండగా వుంది. బీరు కావాలా? స్కాచ్ కావాలా?" నాకేసి తిరిగి అడిగాడు

వాడు "సత్యం" గా వుంటే ఒక్కడిసీ ఎలా ఎంజాయ్ చేయనూ. అని అనుకొని. 'ఏం వద్దుగే- మీల్సు పట్టుకొనిరమ్మనూ' అన్నా.

జేబులోంచి నాలుగు పచ్చకాగితాలు తీసి "ఆరు చిల్డు బీరూ. ఒక జానీవాకర్ బ్లాక్ లేబిల్. మూడు డన్హిల్ పాకెట్లు తే" అన్నాడు.

బేరర్ కదిలాడు. "వచ్చేటప్పుడు మసాలా క్యాజూ పట్టా" తిరిగి అన్నాడు.

"యివన్నీ ఎందుకురా నా ఒక్కడికీ?" అర్థంకాక అడిగా. వాడు జవాబు యివ్వలేదు. మళ్ళీ నవ్వాడు. ఎ. సి మూలంగా గదిలో చాల హాయిగా వుంది. సుధ మోకాలి వరకు లుంగీ ఎత్తుకొని వెల్లకిల్లా పడుకున్నాడు. వాడు ఏం చేస్తున్నాడో నాకు అర్థం కాలేదు. ఎ. సి. హోరు తప్పిస్తే గదిలో చాల నిశ్శబ్దంగా వుంది.

బేరర్ తెచ్చిన సరుకులు టీపాయ్ మీద సర్దాడు. సుధ లేచి బీరు సీసాలు ఓపెన్ చేసి గ్లాసుల్లో పోశాడు. తను ఒకటి తీసుకొని నా చేతికి ఒకటి యిచ్చాడు. సిగరెట్టు అంటించుకొని పైపై నా ముందుకు తోశాడు 'చీర్స్' అంటూ గడగడా తాగేసి. ఖాళీగ్లాసు టీపాయ్ మీద పెట్టాడు. నేను ఆశ్చర్యం నుంచి తేరుకోలేక పోతున్నా-

"కమాన్- ఐ వాంట్ టు హేవ్ సెకండ్ రౌండు కంప్లీట్ యిట్" హుషారుగా అన్నాడు. నేను గ్లాసుఎత్తి పెదాల దగ్గర పెట్టుకున్నా వాడు రెండో రౌండుకు సీసాల్లోంచి వంపుకుంటున్నాడు.

"సుధా, రుక్మిణి అంత జాగ్రత్తలు చెప్పిందికదా–నీ హెల్తుకూడా బాగాలేదుట. మరీ యింత యెక్కువగా.... "నా మాట పూర్తికాలేదు

వాడు రెండోగ్లాసు పూర్తి చేశాడు. మూడో గ్లాసుకు తయారవుతున్నాడు నాకు చాల భయంగారుగా వుంది. వాడు మంచి స్వింగులోకివస్తున్నాడు. "కాసీయ్ముందర తర్వాత చెప్తా" "నన్ను తొందర చేశాడు; ఖాళీ అయిన నా గ్లాసులో పోసి! యింకొక సిగరెట్టు అంటించాడు. వాడి కళ్ళు మిల మిలా మెరుస్తున్నాయి. యింతలో ఫోను రింగయింది సుధ లేచి రిసీవరు ఎత్తాడు.

"హల్లో!"

అవతల నుంచి స్వీడ్గా వాయిస్ విన పడుతోంది. "ఓ.... సుజాతా.... ఎలా వున్నావ్?.... ఆ.... ఆ.... వచ్చేశా.... జస్ట్ నౌ.... వస్తావా?.... రా.... అన్నట్టు మీ ఫ్రండు యూనీస్ వుందా?.... నాకోసం కాదులే.... మా ఫ్రెండు వచ్చాడులే. వాడికి కంపెనీగా.... ఆల్ రైట్ సాయంత్రం ఆరింటికల్లా యిద్దరూ వచ్చేయండి." ఫోను పెట్టేశాడు.

వాడి సంభాషణలు నాకు ఏమీ అంతు పట్టలేదు- ప్రశ్నార్థకంగా చూశా వాడికేసి.

"ఏం లేదులే.... టు స్పెండ్ సమ్ టయిమ్.... యూనీస్ బాగుంటుంది, మంచి కంపెనీ.... యు విల్ లైక్ హర్" నేను ఎలాంటి రెస్పాన్సు యివ్వలేదు. నా మొహంలో ఆశ్చర్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

వాడు నన్ను పట్టించుకోలేదు. గ్లాసు గడగడా ఖాళీ చేశాడు. రుక్మిణి యిచ్చిన టానిక్కులూ. టాబ్లెట్స్ సజ్జలోంచి తీశాడు. వాటికేసి పరీక్షగా చూశాడు. చిన్నగా నవ్వుకున్నాడు వాష్బేసిన్ కేసి నడిచాడు. నేను వాడికేసే చూస్తున్నా. దగ్గరకు రమ్మనమని సౌంజ్ఞ చేశాడు. అప్రయత్నంగా నడిచా.

మూడు టానిక్కు సీసాలు పైకి తీశాడు. "వీటిని రోజుకి యెన్నిసార్లు వేసుకోవాలి?" నాకేసి చూస్తూ అడిగాడు.

"మూడుసార్లు" రుక్మిణి చెవులలో యిల్లు కట్టుకొని పోరిన మాటలు పైకి కక్కేశా

"అంటే-మనం యిక్కడ వుండే మూడు రోజులకి తొమ్మిది సార్లు- సో. యింతవరకు తాగాలన్నమాట" సీసా అడుక్కి వేలు పెడుతూ అన్నాడు.


నేను బుర్ర వూపా - వేలు పెట్టినంత వరకు ఖాళీ అయ్యేట్లుగా మూడు సీసాలూ వాష్ బేసిన్లో వంపాడు మాత్రలు మూడురోజులవీ లెక్కపెట్టి డస్ట్బకెట్లో వేశాడు ఖాళీ సీసాలు జాగ్రత్తగా తిరిగి సజ్జలో సర్దాడు.

"ఏమిట్రా యిది, నీ హెల్తు సంగతి మర్చిపోయావా?" చాలా భయంగా అడిగా. జవాబు లేదు అలవాటుగా చిరునవ్వు తప్పించి వాడి నవ్వు చూస్తుంటే నాకు కంపరం పెడుతోంది

"భయంగారు పడకురా.... యిది నాకు చాల మామూలు విషయం.... నీవు అనవసరంగా ఆలోచించి టైము పాడు చెయ్యకు" నా గ్లాసు నింపుతూ అన్నాడు

"సుధా- యిది మంచిపని కాదురా నీవు మోసగిస్తున్నది ఆమెని కాదు.... నీ ప్రేమని.... ఒక విధంగా నిన్ను నువ్వే మోసగించుకుంటున్నావ్". వాడు నవ్వబోయి. నా ముఖంలోని సీరియస్నెస్ను చూసి ఆగిపోయాడు. నాకు వాడంటే అసహ్యం జుగుప్స కలుగుతున్నాయ్

"ఒరేయ్ కోపగించుకోకురా....



నెవ్వరినీ మోసగించటం లేదు. అన్యాయం అంతకన్నా చేయటం లేదు"

"మరి" అర్ధం కాన్నట్లుగా ఓ వెర్రి ప్రశ్న వేశా. "అసలు సంగతి చెపుతా విను" సిగరెట్టు ఆష్ ట్రేలో ప్రెస్ చేస్తూ అన్నాడు

చెప్పమన్నట్లుగా చూశా, వాడికేసి.

వాడు మొదలుపెట్టాడు. "ఓ విధంగా నాది చాల దురదృష్టకరమయిన జాతకం. అందరూ అనుకుంటూన్న సుఖాలు సంతోషాలు లేని జీవితం నాది నాలుగేళ్ళ క్రితం నాకు అనుకోకుండా గుండెల్లో నొప్పిలా వచ్చింది డాక్టరు చూసి శ్లేష్మ నొప్పి అన్నాడు. రెండురోజులకే లేచి తిరిగా. ఆ రెండు రోజుల్లో రుక్మిణి మొక్కని దేముడులేడు నిద్రాహారాలు మానివేసింది— నేనులేచి తిరిగేవరకు అప్పుడే మా పక్కింటాయనకు యిలాంటి నొప్పే వచ్చింది. వాళ్ళు డాక్టర్ రావ్ అని. ఒక ఫారెన్ రిటర్నడ్ డాక్టరును తెచ్చారు. ఆయన దానికి చాల పెద్ద పేరుతో వున్న జబ్బని చెప్పి. ట్రీటుమెంటు యిచ్చారు. అయినా ఆయనదక్కలేదు. అది చూసిన రుక్మిణి. ఆ డాక్టరుగారితో నాకు వచ్చిన నొప్పి గురించి అడిగింది. ఆయన వంద రూపాయలు కన్సల్టేషన్ ఫీజుగా తీసుకొని. ఒక తావు పొడుగు ప్రివెన్టివ్ కోర్సు ప్రిస్క్రయిబ్ చేశారు ముప్పైఏదాటినలభై వడిలోపడే ప్రతీవాడూ తప్పనిసరిగా ఆచరించవలసినవి అలాచెయ్యకపోతే మనిషికి చాల కాంపికేషన్స్ వస్తాయట ఆయన ప్రకారం నేను సిగరెట్లు వాసన చూడకూడదు. డ్రింకు ముట్టుకోకూడదు. తిండి చాల కంట్రోల్ చేయాలి. పత్యంగా తినాలి ఎగ్జయిట్మెంటు పనికిరాదు ఆఖరికి సంసారం కూడా చాల లిమిటెడ్‌గా వుండాలి.... యింకా చాలా చాలా వున్నాయ్

ఆ రోజునుంచి రుక్కు నాకు ట్రీటుమెంటు మొదలెట్టింది. ఆమెను బాధపెట్టడం యిష్టం లేక ఏదో అడ్జస్టు అవుదామనుకున్నా- కానీ ఒక్క రోజు కూడా అలా జాపవేకపోయా రుక్మిణిలో బెంగ పెరుగుతోంది. మొహంలో భయం గూడు కట్టుకొంది. అయినా నేను లెఖ్ఖ చేయలేదు నా రొటీన్ ప్రకారం గడిపా. ఉన్నట్టుండి మళ్ళీ నాకు గుండెల్లో నొప్పి వచ్చింది. క్వయిట్ యిన్‌సిడెంటల్. మళ్ళీ రెండు రోజుల్లో మామూలుగా లేచి తిరిగా.... యీ లోగా. రుక్కు నెర్వస్‌గా ఫీలయింది. ఆమెకి బి.పి పెరిగింది.... గుండెదడలా వచ్చేది. ఆఖరికి వున్నట్టుండి ఫిట్సులా వచ్చి పడిపోయేది. మనిషి బిగుసుకుపోయేది. నన్ను ఎక్కడలేని భయం ఆవహించింది. నా డాక్టరు ఫ్రెండుని పిలిచా. అతను రుక్మిణిని పరీక్షించి ఒకటే కోర్సు ప్రిస్క్రయిబ్ చేశాడు"

వాడు ఒక క్షణం ఆగి రెండుగుక్కల్లో గ్లాసు ఖాళీచేసి. సిగరెట్టు గట్టి దమ్ముకొట్టి మళ్ళీ మొదలెట్టాడు. నేను కామ్‌గా వింటున్నా

"నేను డాక్టరు మాటల్లోనే చెపుతా.... మిస్టర్ సుధా.... మీ మిసెస్‌కు బి. పి. ఎక్కువగా వుంది. నరాల నిస్సత్తువ విపరీతంగా వుంది చాల జాగ్రత్తగావుండాలి నెగ్లెక్ట్ చేస్తే చాల కాంప్లికేషన్స్ వస్తాయి" అన్నాడు

"డాక్టర్ ఏం చేయమంటారు! ఎంత డబ్బు ఖర్చయినా పర్వాలేదు. ప్రపంచంలో ఎక్కడకు తీసుకొని వెళ్ళమన్నా వెడతా" అన్నాడు.

డాక్టర్ నవ్వాడు. "ట్రీట్‌మెంట్ ఆమెకు అఖ్ఖర్లేదు. కానీ మీకు కావాలి."

డాక్టరు మాటలు నాకు అర్థం కాలేదు. మళ్ళీ ఆయనే చెప్పాడు

"మీ మిసెస్‌కు ఏ మందులూ అఖ్ఖర్లేదు. ఆవిడకున్న వర్రీ మీ ఆరోగ్యం గురించి. మీకు ఏదో హార్టు ట్రబుల్ వుందని ఆవిడకి గట్టి నమ్మకం. కానీ మీ కెలాంటి జబ్బూలేదు అ నాకు తెలుసు. కాని ఇండియాలో పుట్టి, ఇండియాలో పెరిగిన నాకుగానీ, మరి యెవ్వరితరంకాదు ఆమెను నమ్మించడం. అందుకని మీరు జబ్బుగా వున్నట్లు వూహించుకొని ఆ ఫారెన్ రిటర్నడ్ డాక్టరు యిచ్చిన ప్రిస్క్రిప్షన్ పూర్తిగా ఫాలోకావాలి. మీరే మాత్రం ఖాతరుచేయక. దాన్ని కాదన్నా. మీమీద మమకారం, ఆపేక్ష. ప్రేమా, అభిమానం పెంచుకొన్న మీ మిసెస్ సహించలేదు. మీ ఆరోగ్యమే ఆమె ఆరోగ్యం అనుకొనే ఆమెకు అప్పుడు మీరే మందు యిచ్చినా లాభంలేదు ఆమె ఆరోగ్యంగా. ఆనందంగా వుండాలంటే మీరు హార్టు పేషెంటు కావాలి. ట్రీట్‌మెంట్ తీసుకోవాలి. లేకపోతే ఆ దేముడు కూడా ఆమెను రక్షించలేడు. యిదే ఆమె జబ్బుకు నేను మీకు యిచ్చే ప్రిస్క్రిప్షన్"

డాక్టరు మాటలు నాకు వెర్రెక్కించాయి. ఏం చెయ్యాలి.... ఏ జబ్బూలేని నేను ట్రీట్‌మెంట్ తీసుకోవాలి. డైటింగ్ చేయాలి. నియమాలు నిష్ఠగా ఆచరించాలి. ఎలా? ఎన్నాళ్ళు యీ రోగిష్టి జీవితం?? కాదంటే??? నా రుక్కు ఏమవుతుంది?? ? ప్రేమగా, వాత్సల్యంతో, నిండి వుండే ఆమె మొహం నాకు కొట్టొచ్చినట్లు కన్పించేది. నా కోసం అహర్నిశలూ బాధపడి పాటుపడే రుక్కు లేకుండా నేను బ్రతకలేను ఆమెను దూరం చేసుకోలేను.

అందుకే.... అందుకే.... నేను హార్టు పేషంటునయ్యా. మనిషిని యంత్రంలా మారా. ఆమెకన్నుల్లో సంతోషం మాయం కాకూడదు. నా యింటి దీపం ఆరకూడదు. అదే నాలక్ష్యంసుఖాలూ సంతోషాలూ.... త్యాగంచేశా. స్నేహితులూచుట్టాలనీ మరిచిపోయా. నా చుట్టూ ఒక గిరిగీసుకున్నా. అందులో ఎవ్వరికీ చోటు లేదు. నా రుక్కుకి తప్ప" వాడి కంఠం గద్గదమయింది. "అప్పటినుంచి జీవితంఓనాటకరంగంగా మార్చుకున్నా జీవితంలో నటించడం మొదలుపెట్టా. వెర్రిరుక్కు!! నా జీవితంలో నటనను గ్రహించలేకపోయింది. నా నటనలో పెర్‌ఫెక్షన్‌కు చేరుకున్నా........ నీలాంటిఆప్తమిత్రుడు వచ్చినా నా గిరి దాటి బయటకు నేను రాలేను. లోపలకు రానివ్వలేను. ఎప్పుడైనా బోరుకొడితే.... ఈ అర్జెంటు మీటింగులూ........కాన్ఫరెన్సులూ సృష్టించుకుంటూ విశాల ప్రపంచంలోకి అడుగు పెడతా.. అదే రుక్కు ఆరోగ్యం కోసం నేను ఫాలో అవుతున్న ప్రిస్క్రిప్షన్."

వాడి కనుకొనుకుల్లో మంచి ముత్యాలుగా మెరుస్తున్నాయి కన్నీళ్ళు. ●

సిటీ పబ్లిక్ స్కూల్
విజయవాడ-8
(ఇంగ్లీషు మీడియం)
మీ పిల్లలకు
నవీన పద్ధతిలో ప్రత్యేక శిక్షణ.
L. K. G. నుండి 10 వ తరగతి వరకూ.
స్కూలు బస్సు, హస్టలు వసతి కలదు
అడ్మిషన్లు జరుగుతున్నవి.
కొద్ది సీట్లు మాత్రమే ఉన్నవి.

గల్ఫ్ దేశాలలో
ఉద్యోగావకాశాలు
మిడిల్ ఈస్ట్ దేశాలలో డైరెక్టు ఉద్యోగాలు పొందేందుకు ఉచిత సాహిత్యం మరియు గైడెన్స్ కొరకు వ్రాయండి స్వంత చిరునామా కలిగిన స్టాంపు అంటించిన కవరు పంపండి
Globe Service Information Centre (Regd.) (AV-6)
WZ-69, Nangli Jalib,
New Delhi 110058.